విద్యుత్ వినియోగంలో తస్మాత్...!

- వర్షాకాలంలో ప్రమాదాలకు అవకాశం
- విద్యుత్ వైర్లు, లైన్‌లు యమపాశల్లా మారే ప్రమాదం
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న అధికారులు

పాలకొండ రూరల్:

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 26 వేల హెక్టార్లు పైబడి వరి సేద్యం జరుగుతుంది. వేలాది కుటుంబాలు చెందిన రైతులు, సంబంధిత రంగాలకు చెందిన వ్యవసాయ వేతనదారులు నిత్యం పొలంబాట పడుతున్నారు. అజాగ్రత్త, నాణ్యతలేని విద్యుత్ ఉపకరణాల వాడకం, భారీ గాలులకు విద్యుత్ వైర్లు తెగి పడటం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద చోటు చేసుకుంటున్న ఇక్కట్ల కారణంగా ఏటా ఈ సీజన్‌లో పలుచోట్ల విద్యుతాఘాతాల బారినపడి పలువురు సమస్యల పాలవుతున్నారు. గతంలో నియోజకవర్గ పరిధి పాలకొండ మండలం అంపిలి గ్రామానికి చెందిన ఓ రైతు సాగునీటి మోటారు వేసే క్రమంలో షాక్‌కు గురై మరణించారు. వీరఘట్టం మండలం కంబరవలసలో ఓ మహిళా రైతు విద్యుత్ వైర్లు తగిలి మృతి చెందారు. ఇలా పలు చోట్ల రైతులు, రైతు వేతనదారులతో పాటు పాడి పశువులు గతంలో విద్యుత్ షాకుకు గురైన మత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలో తగు జాగ్రత్తలు తప్పనిసరని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు.



పాలకొండ మండలంలో శివారు పొలాల వద్ద కాలిపోతున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

పొలాల్లో ప్రమాదభరితంగా...

గ్రామీణ ప్రాంతాలకు విద్యుత్ విస్తరణలో భాగంగా వ్యవసాయ భూముల మీదుగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు జరిగింది. నాలుగు మండలాల పరిధిలో దాదాపు 7 వందలకు పైగా వ్యవసాయ విద్యుత్ మోటార్లు ఉండగా సుమారు వందలకు పైబడి విద్యుత్ స్తంభాలు, 2,035 పైచిలుకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు రికార్డులు పేర్కొంటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, భారీ గాలులుతో కూడిన వర్షాలు కారణంగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోవడం ద్వారా వైర్లు కొన్ని ప్రాంతాల్లో కిందకు వేలాడుతున్నాయి. మరికొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలకు ప్రత్యామ్నాయంగా కర్రలు వినియోగిస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రస్తుత ఖరీఫ్‌లో నిత్యం రైతులు పొలంలో అధిక సమయం గడపాల్సి వస్తుంది. ముఖ్యంగా తోటపల్లి కాలువల ద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందకపోవటంతో వారు ప్రత్యామ్నాయ పద్ధతుల్లో మోటార్ల సాయంతో నీరు అందిస్తున్నారు. ఈ తరుణంలో విద్యుత్ సంబంధిత పరికరాలు వినియోగించే సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించటం లేదా ప్రమాణాలు పాటించకపోవటంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రైతులు పొలాలకు నీరు కట్టేందుకు ఏర్పాటు చేసుకున్న పంపు షెడ్లలో గల సాగునీటి మోటార్ల వద్ద ప్రమాణాలు పాటించకపోవడం పరిపాటిగా మారింది. ప్రస్తుత సీజన్‌లో ప్రమాదాల బారిన పడకుండా ఉండాలంటే ముందస్తు చర్యలపై అవగాహన అవసరం.



స్థానిక కస్పావీధిలో ఒకే విద్యుత్ స్తంభం మీదుగా భయం గొలుపుతున్న విద్యుత్ వైర్లు

ఇలా చేస్తే మేలు...

రైతులు పంపుసెట్లు వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ బోర్డులపై నీరు చేరకుండా ప్లాస్టిక్ కవర్లతో రక్షణ కల్పించుకోవాలి. మోటారు ఉన్న ప్రాంతంతో పాటు, విద్యుత్ స్విచ్ బోర్డు ఏర్పాటు చేసుకున్న ప్రాంతంలో నీరు చేరకుండా జాగ్రత్తలు పాటించాలి. పొలంలో విద్యుత్ పరికరాలు వినియోగించే సమయంలో చేతికి, కాళ్లకి రబ్బరు గ్లౌజులను, చెప్పులను వాడటం శ్రేయస్కరం. విద్యుత్ స్విచ్ బోర్డులకు సంబంధించి నాణ్యమైన వైర్లు వాడాలి. ముందుగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను నిపుణులైన ఎలక్ట్రీషియన్ల ద్వారా పరిష్కరించుకుంటే మేలు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద పనులు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలి. పొలాల్లో వేలాడుతున్న విద్యుత్ వైర్లును గుర్తించినా, ప్రమాదం ఉందని భావించిన వైర్లు తెగిపడి ఉన్నా తక్షణమే విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలి. విద్యుత్ చౌర్యంకు పాల్పడం, కర్రల సాయంతో విద్యుత్ వైర్లను తాకటం మంచిది కాదు. గృహ, చిన్న, సన్నకారు పరిశ్రమలు, వివిధ కరాల మిల్లుల వద్ద ప్రస్తుత సీజన్‌లో వైరింగ్, స్విచ్ బోర్డులను పరిశీలించుకోవాలి.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



ఇటీవల వీచిన భారీ గాలులు, వర్షాల కారణంగా ఏర్పడిన విద్యుత్ సమస్యలు పరిష్కరించాం. సమస్యలు గుర్తించటం, ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులు దృష్ట్యా ప్రతీ శుక్రవారం నిర్వహణ పనులు ఉన్నతాధికారుల సూచనతో చేయిస్తున్నాం. ప్రమాదభరితంగా ఉన్న స్తంభాలను తొలగించడంతో పాటు రక్షణ చర్యలు కూడా తీసుకుంటున్నాం. అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కంచెలు ఏర్పాటుకు శాఖాపరమైన అధికారులకు విన్నవించాం. సమస్యలు గుర్తిస్తే రైతులు, విద్యుత్ వినియోగదారులు మా దృష్టికి తీసుకురావాలి.

– ఎల్.యోగి, ట్రాన్స్‌కో ఏఈ, పాలకొండ

క్లుప్తంగా

శ్వేతవర్ణధారిగా మరకత లింగేశ్వరుడు



శ్వేతవర్ణధారిగా దర్శనమిస్తున్న శ్రీమృత్యుంజయ మరకత లింగేశ్వరుడు

పాలకొండ రూరల్: భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ మృత్యుంజయ మరకత లింగేశ్వరుడు మంగళవారం శ్వేతవర్ణధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక నక్కలపేటలో వెలసిన అన్నపూర్ణ సహిత స్వామివారి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా నిత్య అలంకరణ పూజలు చేస్తున్నరు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక భీమలింగేశ్వర ఆలయంలో స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు గాసీబాబు అలంకరించారు.

రవిబాబుకు రేంజర్‌గా పదోన్నతి



పి.రవిబాబు

వీరఘట్టం: వీరఘట్టం అటవీశాఖ సెక్షన్‌లో గత ఐదేళ్లుగా డిప్యూటీ రేంజ్ అధికారిగా పని చేస్తున్న పి.రవిబాబు రేంజర్‌గా పదోన్నతి పొందారు. ఈయన పదోన్నతిపై అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌కు బదిలీ అయ్యారని అటవీశాఖ అధికారులు మంగళవారం తెలిపారు.

రంగనాథన్‌కు ఘనంగా నివాళులు



గ్రంథాలయాల ఆవశ్యకతను వివరిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ సైన్స్ పితామహుడు, గ్రంథాలయ ఉద్యమకారుడు ఎస్ఆర్ రంగనాథన్ జయంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.శ్రీవరం, అధ్యాపకులంతా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయాల స్థాపనకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. పుస్తక పఠనం ద్వారా ప్రజలకు విజ్ఞానం అందుతుందని, తద్వారా సమాజ అభివృద్ధి జరుగుతుందని నమ్మిన వారిలో రంగనాథన్ ముందు వరుసలో ఉంటారన్నారు. అందుకే ఆయన గ్రంథాలయాల ఆవశ్యకతను తెలియజేసేలా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో ఆయన పుట్టిన రోజున జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు కావాల్సిన అన్ని పుస్తకాలతో పాటు అకడమిక్ ఇయర్ పుస్తకాలు కూడా అందుబాటులో ఉంటాయని విద్యార్థులు, నిరుద్యోగ యువత వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీవరం, అధ్యాపకులు వి.కల్పన, ఎ.శ్రీవాణి, జె.స్వరూప, జి.తులసి, పి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఎన్ఎంయూ ఆందోళన



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగులు

పాలకొండ రూరల్: ఆర్టీసీ ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీని ప్రకటించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పాలకొండ డిపో ఎదుట ఎన్ఎంయూ నేతృత్వంలో ఉద్యోగులు ఈ మేరకు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.కోటేశ్వరరావు, కె.శంకరరావు మాట్లాడుతూ పీఆర్సీతో పాటు వేతన సవరణ జరిగి రెండేళ్లు పూర్తి కావస్తోన్న క్రమంలో ఐఆర్ కూడా ప్రకటించాల్సి ఉందన్నారు. ఆర్టీసీ సంస్థకు చెందిన గవర్నర్‌పేట – 2 డిపో ఆస్తి 4.15 ఎకరాల భూమిని లూలూ సంస్థకు బదలాయింపు చేసే యత్నం మానుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయండి..

ఇందుకు సంబంధించిన జీవో ఉపసంహరించుకోవాలని, ఆర్టీసీ ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల విడుదల, పదోన్నతులను కల్పించటంతో పాటు పాత పెన్షన్ విధానం అమలుకు చర్యలు చేపట్టాని నినాదాలు చేశారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలన్నారు. ఎన్ఎంయూ ముఖ్య నాయకులు ఎస్టీ రావు, సుబ్బారావు, ఎం.వైకుంఠం, పీఎల్ రావు, స్థానిక డిపో కార్యదర్శి వావిలపల్లి రాజేష్ పాల్గొన్నారు.

సొలికిరిలో ఘటాల ఊరేగింపు



భామిని మండలం సొలికిరిలో శ్రీనూకాలమ్మ దేవి గ్రామ దేవత మందిర ప్రతిష్ఠ పూజలు మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఘటాల ఊరేగింపుగా తిరువీధి నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతకు పూజలు చేసి ప్రతిష్ఠాపన చేపట్టారు. – భామిని

ఎరువుల దుకాణాల తనిఖీ

వీరఘట్టం: ఎరువుల దుకాణాలకు యూరియా కోసం వచ్చే రైతులకు జింకు ప్యాకెట్లు లింకు పెట్టి అమ్మవద్దని తహసీల్దార్ ఎ.ఎస్.కామేశ్వరరావు సూచించారు. మండల వ్యవసాయ శాఖ అధికారిణి సౌజన్యతో కలసి స్థానికంగా ఉన్న పలు ఎరువుల దుకాణాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే షాపుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. స్టాక్ వివరాలు పక్కాగా ఉండాలని, ఈ పాస్ మిషన్ బ్యాలెన్స్‌కు, గ్రౌండ్ లెవెల్ బ్యాలెన్స్ సరిసమానంగా ఉండాలని సూచించారు. వీరితో పాటు వీఆర్వో వి.రమేష్‌నాయుడు ఉన్నారు.

భామినిలో...

భామిని: మండలంలో ఎరువుల దుకాణాలను అధికారుల బృందం మంగళవారం తనిఖీలు చేసింది. తహసీల్దార్ శివన్నారాయణ, ఎంఏవో కొల్లి తిలక్, బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు ఆధ్వర్యంలో భామిని, సింగిడి, బత్తిలిలో ప్రైవేటు ఎరువుల డిపోతలను తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, స్టాక్ రికార్డులను సరిపోల్చి చూశారు. ఎంఆర్ఐ మణి ప్రభాకర్, ఏఏ ఈశ్వర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ కామేశ్వరరావు, ఏవో సౌజన్య

నులిపురుగులు నులిమేద్దాం!



పాలకొండ రూరల్: తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల నోట్లో ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న డాక్టర్ అంకిత



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): లంకాజోడు ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మొండెంఖల్లు పీహెచ్‌సీ వైద్యురాలు ప్రజ్ఞ

గరుగుబిల్లి/గుమ్మలక్ష్మీపురం/గుమ్మలక్ష్మీపురం(కురుపాం)/పాలకొండ రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ మంగళవారం చేపట్టారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయసు వారందరికీ ఈ మాత్రలు అందించి, వారితో వేయించారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నిర్మూలించవచ్చని, ఒకటి, రెండేళ్ల వయసు వారు అరముక్క, రెండేళ్ల వయసు దాటిన వారంతా పూర్తి మాత్ర వేసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

సీతంపేట: సీతంపేట పార్కు జంక్షన్ వద్ద అతివేగం, రహదారి ప్రమాదాలు, సైబర్ నేరాలపై ప్రజలకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. డ్రైవింగ్ చేసేవారు మద్యం సేవించవద్దని, ఘాట్‌రోడ్‌లో జాగ్రత్త వహించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు, ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మేము రైతులం కాదా?

పాలకొండ రూరల్: తాము రైతులం కాదని కూటమి ప్రభుత్వంలో పాలకులు నిర్ణయించారా? అంటూ మండలంలోని అట్టలి గ్రామానికి చెందిన రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అన్నదాత సుఖీభవకు సంబంధించిన మొత్తాలు తమకు పడలేదంటూ పాలకొండ తహసీల్దార్ రాధాకృష్ణను మంగళవారం కలిసి తమ గోడు వినిపించారు. తమలో కొందరికి పీఎం కిసాన్ యోజన నగదు మాత్రమే జమైందని, మరికొందరికి ఏ లబ్ధి చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో ఎల్‌పీఎం నంబర్లు కూడా కనిపించడం లేదని తహసీల్దార్‌కు వివరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తామంతా లబ్ధిదారులమేనని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తమ గుర్తింపు, భూములకు సంబంధించిన వివరాలు లేకపోవడం అన్యాయమన్నారు.



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న అట్టలి రైతులు, ప్రజా ప్రతినిధులు

ఈ సమస్య పరిష్కరించాలని సర్పంచ్ దాము తహసీల్దార్‌ను కోరారు.

కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు కనుముల సూర్యనారాయణ, రైతులు, నాయకులు సిర్లి యోగేశ్వరరావు, రాము, రామకృష్ణ, నారాయణమ్మ, బోగేశ్వరరావు, పోలమ్మ గారమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రైతులు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను కలిసి తమ గోడు విన్నవించారు.

మైనర్లు వాహనాలు నడపరాదు..



బత్తిలిలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ అప్పారావు

భామిని: మండలంలోని బత్తిలిలో ఎస్ఐ జి.అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమన్నారు. వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహన పత్రాలు వాహన చోదకులు కలిగి ఉండాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కోటదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటదుర్గమ్మ దేవస్థానానికి శ్రావణ మంగళవారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ క్రమంలో అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు, పుష్పాభిషేకాలు జరిగాయి. మొక్కులు చెల్లించేందుకు సంబరాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ నేతృత్వంలో అమ్మవారి సహస్ర నామార్చన భక్తి శ్రద్ధలతో చేపట్టారు. నక్కలపేటలో వెలసిన జ్ఞాన సరస్వతి మందిరంలో, స్థానిక కాశీవిశ్వేశ్వర ఆలయంలో చేపట్టిన విశేష పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

కషాయాలు, ద్రావణాల తయారీపై శిక్షణ

గరుగుబిల్లి: పంటల్లో చీడపీడలను నివారించేందుకు వినియోగించే కషాయాలు, ద్రావణాల తయారీపై మూడు జిల్లాలకు చెందిన 40 మంది బయో రిసోర్స్ కేంద్ర యజమానులు, రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు మంగళవారం తెలిపారు. ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రం శిక్షణ, తోటపల్లి జట్టు సంస్థ నూతన కార్యాలయ ప్రాంగణంలో శిక్షణ సాగుతోందన్నారు. నీమాస్త్రం, అగ్నిహస్త్రం, బ్రహ్మస్త్రం తదితర కషాయాల వినియోగంతో పంటలను ఆశించే రసంపీల్చేపురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో కన్సల్టెంట్స్ రమప్రభ, ప్రవీణ్ ఎస్ఎఫ్ఏ, జి.అన్నపూర్ణ, బి.శ్రీరామ్, సీహెచ్ రవికుమార్, శంకరరావు, పాపారావు, రిసోర్సు కేంద్రాల యజమానులు పాల్గొన్నారు.

గ్రంథ పాలకుల దినోత్సవం

పాలకొండ రూరల్: గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని స్థానిక శాఖ గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గ్రంథ పాలకుల దినోత్సవాన్ని గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. షియాలీ రామామృత రంగనాథన్ జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. బెంగళూరుకు చెందిన శివశ్రీ చారిటబుల్ ట్రస్టు సమన్వయంతో శిక్షణ ఫౌండేషన్ డిజిటల్ లైబ్రరీకి సహకరిస్తున్నట్టు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



లుంబూరులో రైతులు, వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

పాలకొండ రూరల్: రైతులకు ఎటువంటి ఇబ్బందులు కగగకుండా అధికారులు చొరవ చూపాలని పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. మంగళవారం పాలకొండ మండలం లుంబూరు గ్రామాన్ని సందర్శించిన ఆయన అక్కడి రైతు మిత్ర కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఖరీఫ్ సీజన్‌లో అధికారులు అన్నదాతలకు అందుబాట్లో ఉండాలన్నారు. వారికి అవసరమైన సలహాలు సూచనలు అందిస్తూ అండగా నిలవాలన్నారు. సమస్యలు శాఖా పరమైన అధికారుల ద్వారా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ యూరియా లుంబూరు కేంద్రంగా అక్కడి రైతులకు అందించనున్నట్టు తెలిపారు. అంతకు ముందు పట్టణ పరిధిలో విశాఖ రహదారిలో గల మన గ్రోమోర్ ఎరువుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న ఎరువుల నిల్వలను, రిజిస్టర్‌లో ఉన్న వివరాలను సరిపోల్చారు. నాణ్యత లేని విత్తనాలు, ఎరువులు, ఇతర మందుల అమ్మకాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతుల నుంచి ఫిర్యాదులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాధాకృష్ణ, వ్యవసాయ శాఖ ఏడీ కె.రత్నకుమారి, ఏవో ప్రసాదరావు, వీఆర్వో బి.రాజా, సౌమ్య తదితరులున్నారు.

బాబు పాలనలో ప్రజలకు ఇబ్బందులు

సీతంపేట: సీఎం చంద్రబాబు 14 నెలల పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని జి.గుమ్మడ గ్రామంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్లు ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వం ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా ప్రజలకు అందించడం లేదన్నారు. గిరిజన ప్రాంతాల్లో మరీ దారుణంగా ఉందన్నారు. మౌలిక వసతులు లేవన్నారు. ఫీజు రియంబర్స్‌మెంట్ అందక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలు అందరికి ఇవ్వలేకపోయారన్నారు. ఏడాది పాటు ఈ పథకాలను ఎగ్గొట్టారన్నారు. 50 ఏళ్లకే పింఛన్, నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి పథకాల అమలు ఊసే లేదన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ క్షేత్ర స్థాయిలో బలోపేతంపై పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహన్‌రావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్‌లు ప్రధాని, వెంకునాయుడు, ఎంపీటీసీ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, ఎస్.అబ్బాస్, ఎస్.సురేష్, రామకృష్ణ, ఆనంద్, అక్కమ్మ, వెంకి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ దయానందం తదితరులు

సీతంపేట: శాప్ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీపురంలో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడాపోటీలకు స్థానిక ఏపీటీడబ్ల్యూఆర్ (బాలికలు) పాఠశాలకు చెందిన హెచ్.లాక్షిత ఎంపికైంది. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొననున్నట్లు ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్‌దయానందం తెలిపారు. ఆమెను ఐటీడీఏ ఏపీఓ చినబాబు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, జిల్లా కోఆర్డినేటర్ వాసుదేవనాయుడు తదితరులు అభినందించారు.

‘హర్ ఘర్ తిరంగా’ ర్యాలీ

కొమరాడ: దేశ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ఈ ర్యాలీలో పాల్గొని, జాతీయ జెండాలు ప్రదర్శించి, భారత మాతాకీ జై అని నినాదాలు చేశారు. ఈ నెల 15వ తేదీన ప్రతిఒక్కరూ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని కోరారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, దేశభక్తి చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు